క్లుప్తంగా

చేపల పెంపకానికి నేడు వేలం పాట

అగళి: మండల పరిధిలోని కొమరేపల్లి గ్రామ పంచాయతీలోని రావుడి చెరువులో చేపల పెంపకం కోసం మంగళవారం ఉదయం 11 గంటలకు చెరువు కట్టగల రావుడి ఆంజనేయస్వామి గుడి దగ్గర వేలం పాటను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమ్మ, సర్పంచ్ సుజత తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.5 వేలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

ఇన్‌చార్జ్ ఏపీఓగా మధుసూదన్‌రెడ్డి



లేపాక్షి: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జ్ అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా మధుసుదన్‌రెడ్డి బాధ్యతలను సోమవారం చేపట్టారు. ఇక్కడ ఏపీఓగా పనిచేస్తున్న జ్యోతి పుట్టపర్తి ఏపీడీగా పదోన్నతిపై వెళ్లారు.

గోపాలమిత్రకు తీవ్ర గాయాలు



చంద్రమౌళి

రొద్దం: మండల పరిధిలోని గౌరాజుపల్లి ఎస్సీ కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాలమిత్ర చంద్రమౌళి తీవ్రంగా గాయపడ్డారు. బూచెర్ల గ్రామానికి చెందిన చంద్రమౌళి ఎం.కొత్తపల్లి గ్రామంలో పశువులకు వైద్యం చేయడానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గ్రామంలో ఎద్దుల బండిని ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన చంద్రమౌళిని వెంటనే అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం



తహసీల్దారుకు చెక్కు అందిస్తున్న దృశ్యం

పరిగి: మండల తహసీల్దారుగా గతంలో పని చేసిన భరత్‌కుమార్ వైద్య చికిత్స నిమిత్తం స్థానిక దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.25,000 ఆర్థిక సాయం అందించారు. ఆరేళ్ల క్రితం పరిగి మండల తహసీల్దారుగా పని చేసిన భరత్ కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ క్రమంలో స్పందించిన దివ్య ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు ద్వారా చైర్మన్ పరిగి వేణుగోపాలరావు సోమవారం పరిగి తహసీల్దారు హసీనా సుల్తానాకు చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందించారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

హిందూపురం టౌన్: గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలంటూ పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ సీపీఐ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని 'ప్రపంచ శాంతి వర్ధిల్లాలని' యుద్ధం వద్దు శాంతి ముద్దు' అంటూ నినాదాలు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ దాదాపు 42,000 మంది పిల్లలు, మహిళలు ఈ యుద్ధం వల్ల చనిపోయారని, నేటికీ ఇజ్రాయిల్ ఈ యుద్ధాన్ని ప్రారంభించి సంవత్సరమైందన్నారు. వెంటనే గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి బాబు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి మారుతీరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

వాహనంపై నుంచి పడి మహిళ మృతి

సోమందేపల్లి: మండలంలోని నడింపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం బోల్తా పడి సంజీవమ్మ (58) మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో భర్త అంజినప్ప, కుమారుడు తిప్పన్నతో కలిసి హిందూపురానికి వెళుతుండగా నడింపల్లి రైల్వేగేటు వద్ద వాహనం బోల్తా పడింది. సంజీవమ్మ తలకు తీవ్రగాయాలు కావడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని గీతానగర్‌లో ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని దుండగులు ఎత్తికెళ్లినట్లు బాధితుడు శ్రీనాథ్ తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

సిండికేటు

- ఫర్టిలైజర్ దుకాణదారుల ఇష్టారాజ్యం
- రైతులకు అధిక ధరలకు విక్రయిస్తూ మోసం
- అన్ని విధాలా నష్టపోతున్నామని అన్నదాతల ఆవేదన
- అన్నీ తెలిసినా పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు!



అగళి: ఫర్టిలైజర్స్ షాపు నిర్వాహకులు రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలోని అగళి మండలంలో మొత్తం 7 ఎరువుల దుకాణాలను అధికారంగా నిర్వహిస్తున్నారు. ఇక.. అనధికారికంగా మరో 8 షాపులను నిర్వహిస్తున్నారు. అయితే అందరూ సిండికేట్‌గా మారి రైతుల నోట్లో మట్టికొడుతున్నారు. అలాగే అమరాపురం మండలంలో 8, రొళ్లలో 8, గుడిబండలో 5, మడకశిరలో 9 అధికారికంగా ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయి. అనధికారికంగా ప్రతి మండలంలో 3 నుంచి 5 ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయి.

కృత్రిమ కొరత సృష్టించి మరీ..

ఎరువుల అమ్మకాల్లో అక్రమార్కులు రాజ్యమేలుతున్నారు. అధికారిక ధరను పక్కనబెట్టి అధిక ధరలకు ఎరువులు, రసాయనాలను అమ్ముతున్నారు. కృత్రిమ కొరతను సృష్టించి రైతులను తమదారిలోకి తెచ్చుకుంటున్నారు. అందరూ ఒకే మాట.. ఒకే ధర చెబుతూ రైతులను నట్టేట ముంచుతున్నారు. అధికారులు కూడా ఎరువుల దుకాణదారుల వైపు మాట్లాడుతుండటంతో కర్షకులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. సాగులో రసాయన ఎరువులు లేనిదే పంటలు పండని పరిస్థితిలో వ్యాపారులు చెప్పిన రేటుకు ఎరువు బస్తాలు కొని రైతులు పంటలకు వేసుకుంటున్నారు.

ధర పెంచి దోపిడీ

అగళిలో రైతులు దుక్కిలో వాడే డీఏపీ (డయా అమ్మోనియం పాస్ఫేట్), పంట కాస్త పెరగగానే వేసే యూరియా దొరకడం లేదు. ఎక్కువ ధర చెల్లిస్తే మాత్రం అడిగినన్ని బస్తాలు ఇస్తున్నారు. అలాగే పూల తోటలకు ప్రధానంగా డీఏపీ అవసరం. పత్తి, మొక్క జొన్న, రాగి తదితర పంటలకు యూరియా అవసరం. డిమాండ్ మేరకు ఎరువుల లభ్యత లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. అగళి మండలంలో డీఏపీ బస్తా రూ.1350కి, 20:20:13 బస్తా రూ.1175లకు, యూరియా రూ. 266కు విక్రయించాలి. అయితే డీఏపీ రూ.1,450 నుంచి 1550 వరకూ తీసుకుంటున్నారు. 20:20:13 బస్తా రూ.1250 నుంచి రూ 1400, యూరియా రూ.380 నుంచి రూ 440 వరకూ వసూలు చేస్తున్నారు.

అన్నిచోట్లా దందానే..

మడకశిర నియోజగవర్గంలో అన్ని మండలాల్లో అధిక ధరలకు ఎరువుల, మందులను విక్రయిస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఎక్కువ ధర తీసుకున్నా బిల్లులు ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. ఇష్టముంటే కొనండి.. లేకుంటే లేదు అని వ్యాపారులు తెగేసి చెబుతున్నారని అంటున్నారు. రైతులు ఎంతగా ఫిర్యాదు చేసినా అధికారులు నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్పితే డీలర్లపై మాత్రం చర్యలు తీసుకోదని వాపోతున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

ఎమ్మార్పీ కంటే రూపాయి కూడా ఎక్కువ తీసుకోవద్దని వ్యవసాయశాఖ అధికారులుపైకి చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరే విధంగా ఉంది. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల్లోనూ ఎరువుల దుకాణదారులతో ఆయా పరిధిలో పనిచేసే వ్యవసాయ సిబ్బంది లాలూచిపడి ఎరువుల దందాకు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొందరు సంవత్సరానికింత లేకపోతే నెలకింత అని మామూళ్ల మత్తులో జోగుతున్నారని చెబుతున్నారు. అప్పుడప్పుడు తనిఖీల పేరుతో హడావుడి చేయడం తప్ప అధిక ధరలకు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులపై చర్యలేమీ తీసుకోలేవడంలేదని ఆరోపిస్తున్నారు.

ఎక్కువ ధరకు అమ్ముతున్నారు



యూరియా బస్తా రూ.400 కుపైగా, డీఏపీ రూ 1500కు పైగా ఎరువు దుకాణదారులు అమ్ముతున్నారు. ఎక్కువ ధరకు ఎందుకు అమ్ముతున్నారని అడిగితే కొరత ఉంది. మాకు గిట్టుబాటు కావడం లేదు. అందుకే ఎక్కువ ధరకు అమ్ముతున్నాం అంటున్నారు. మాకు గతిలేక కొంటున్నాం. ఏ అధికారికి చెప్పలేకపోతున్నాం. ఒకవేళ చెబితే మాకు మరోసారి ఎరువులు ఇవ్వరు.

– ఈశ్వరప్ప, రైతు, కసాపుర, అగళి మండలం

అధికారులు చర్యలు తీసుకోవాలి



గతంలో ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లోనే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో లేకపోవడంతో వ్యాపారస్తులు కృత్రిమ కొరత సృష్టించి సిండికేట్‌గా మారి ఎక్కువ ధరలకు ఎరువులను అమ్ముతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా తెలియనట్లే ఉంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

– సురేష్, రైతు, మాధుడి, అగళి మండలం

లైసెన్స్‌లు రద్దు చేస్తాం



ఎరువుల దుకాణదారులు డీఏపీ, యూరియా బస్తాలపై ఉన్న ధరకే అమ్మాలి. అమ్మినదానికి రశీదు కూడా ఇవ్వాలి. ఎక్కువ ధర తీసుకున్నారని రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇటీవల కొన్ని షాపుల్లో తనిఖీలు నిర్వహించాం. అధిక ధరలకు అమ్ముతున్నట్లు మాత్రం మా దృష్టికి రాలేదు.

– శేఖర్‌నాయక్, ఏఓ, అగళి మండలం

రోడ్లు, డ్రైనేజీలను నిర్మించండి



మంత్రి సవితకు అర్జీ ఇస్తున్న సీపీఎం నాయకులు

పెనుకొండ రూరల్: పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని సీపీఎం నాయకులు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని భువన విజయంలో, ప్రజా వేదిక కార్యక్రమాన్ని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. పట్టణంలోని 22 వార్డుల పరిధిలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి హరి కోరారు.

410 అర్జీలు

ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవితకు నియోజకవర్గ వ్యాప్తంగా 410 మంది తమ సమస్యలను అర్జీల రూపంలో అందచేశారు. తాగునీరు, హౌసింగ్, విద్యుత్, రేషన్ కార్డులు, పింఛన్లు, రెవెన్యూ తదితర సమస్యలపై మంత్రికి ఫిర్యాదులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు



పావగడ: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం ప్రధాన అర్చకుడు నరసింహ గోపాల స్వామి ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంటోంది. భారతీయ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, ధార్మిక పరంపర నేటి తరానికి అర్థమయ్యేలా అర్చకుడి సతీమణి భారతి వందలాది బొమ్మలను సేకరించి బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. స్థానికులు పెద్ద ఎత్తున బొమ్మల కొలువును వీక్షిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పుష్పశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

రొద్దం: నల్లరేగడి భూములున్న రైతులు సబ్సిడీ పుష్పశనగకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సోమవారం ఏఓ నివేదిత ఒక ప్రకటనలో తెలిపారు. తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జేజీ 11 రకం ధర క్వింటాలు రూ 9,400 కాగా రూ 25 శాతం సబ్సిడీ పోను రూ 7,070 క్వింటాలుకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులకు ఎకరాకు 20 కేజీల ప్రకారం 10 ఎకరాలకు 200 కేజీలు వరుకు పంపిణీ చేస్తామన్నారు. నల్లరేగడి భూములు ఉన్న రైతులు మాత్రమే నమోదు చేసుకోవాలని కోరారు.

మద్యం షాపులకు 11 దరఖాస్తులు

మడకశిర: నియోజకవర్గంలోని మద్యం షాపులకు సోమవారం నాటికి 11 దరఖాస్తులు వచ్చినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. నియోజకవర్గంలోని 10 మద్యం షాపులకు ఈ దరఖాస్తులు వచ్చాయన్నారు. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్, చిత్రంలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

రొళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడు పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. సోమవారం మండలం పరిధిలోని హనుమంతనపల్లిలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు ఇంటి ఆవరణలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ఇసుక దోపిడితో పాటు గ్రామాల్లో పేకాట, మద్యం ఏరులైపారుతున్న పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. త్వరలో జెమిలి ఎన్నికలు వచ్చినా, సార్వత్రిక ఎన్నికలు వచ్చినా వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని దీమా వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషిచేయాలన్నారు. త్వరలోనే అన్ని అనుబంధ కమిటీలను వేసి కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు రంగేగౌడు, మాజీ మండల కన్వీనర్ శివప్రసాద్, వైస్ ఎంపీపీ నాగరాజు, గుడిబండ మండలం కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, వివిధ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు వీరక్యాతరాయప్ప, గగన, నాగరాజుగౌడ, నాగన్న, చంద్రప్ప, అగళి జేసీఎస్ కన్వీనర్ మహేంద్ర, నాయకులు విజయరంగేగౌడు, రఘువీర్, ప్రసన్నకుమార్, చిరంజీవి, భూతేగౌడు, మల్లికార్జున, నాగేష్‌గౌడ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా నాగుల ప్రతిష్ట

పరిగి: మండలంలోని ఊటుకూరులో సోమవారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నరేంద్రరెడ్డి సహకారంతో జరిగిన నాగుల ప్రతిష్ట వైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ కష్టకాలం ఎప్పుడూ ఉండదని, ఇప్పటికే ప్రజలంతా గుర్తించారని త్వరలో వచ్చే మంచి రోజుల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిలీప్‌యాదవ్, మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత, మాజీ కన్వీనర్ జయరాం, ఎంపీటీసీలు అమరావతి, మారుతీరెడ్డి, హొన్నంపల్లి సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, రఫీక్‌ఖాన్, బాబురెడ్డి, రవీంద్రరెడ్డి, పూల చౌడప్ప, తిమ్మారెడ్డి, కృష్ణ, సింగారెడ్డి, అరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పరిగి మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డిని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ పరామర్శించారు.

ఆర్ఎస్‌డీటీగా షెక్షావలి బాధ్యతల స్వీకరణ

రొళ్ల: తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సర్వే డిప్యూటీ తహసీల్దార్ (ఆర్ఎస్‌డీటీగా షెక్షావలి బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఆయనకు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, ఆర్ఐ మంజునాథ్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. అలాగే మండల సర్వేయర్‌గా కిరణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్‌గా రఫిక్, రొళ్ల–2 వీఆర్వోగా నరసింహమూర్తి బాధ్యతలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిలమత్తూరు: మండల పరిధిలోని 544ఈ జాతీయ రహదారి మరవకొత్తపల్లి క్రాస్‌లో రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. హిందూపురం వైపు నుంచి ద్విచక్ర వాహనంలో వస్తున్న అల్లాబకాష్ అనే వ్యక్తి మరవకొత్తపల్లి వైపునకు వెళ్తున్నాడు. అయితే ఇదే క్రమంలో ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చిన కొడికొండకు చెందిన ఓ యువకుడు అల్లాబకాష్ వాహనాన్ని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో అల్లాబకాష్‌కు తీవ్ర గాయాలు కాగా, కొడికొండ యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

'మద్యం' లాటరీ విధానంపై స్పష్టత ఇవ్వండి



మాట్లాడుతున్న మడకశిర నియోజకవర్గ దళిత నాయకులు

హిందూపురం: ప్రభుత్వం మద్యం షాపుల కేటాయింపు కోసం ఈనెల11న లాటరీ తీసే విధానంపై పలు అనుమాలు వ్యక్తం అవుతున్నాయి. దానిపై కలెక్టర్ చేతన్ స్పష్టత ఇవ్వాలని మడకశిర నియోజకవర్గ దళిత నాయకులు బీ.హెచ్.రాయుడు, గుడిబండ మాజీ ఎంపీపీ నరసింహులు తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ మద్యం షాపుల కేటాయింపు లాటరీలో తమ వారికే షాపులు వచ్చేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు టీడీపీ నాయకులు బహిరంగంగానే చెబుతున్నారన్నారు. ఆ మేరకు కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను కూడా అరేంజ్ చేశామంటున్నట్లు తెలిపారు. దీంతో లాటరీ విధానంపై తమను అనుమానాలు ఉన్నాయన్నారు. అందుకే పారదర్శకత కోసం కలెక్టర్, ఎక్సైజ్ కమిషనర్ దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఎక్కువ దరఖాస్తులు రాకుండా అందరినీ భయపెడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే విధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఏజెంట్ల కమీషన్ తగ్గించొద్దు



ఎస్‌డీఎం రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హిందూపురం: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో సీ.పాలసీల ప్రీమియం రేట్లను పెంచి ఏజెంట్ల కమిషన్లు తగ్గించే ప్రయత్నాలు మానుకోవాలని ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కడప డివిజనల్ ఎస్‌డీఎం రవికుమార్‌ను కలసి వినతి పత్రాన్ని ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్స్ సెక్రటరీ జనరల్ ప్రెసిడెంట్ శ్రీనివాసాచారి, శ్యామల చక్రవర్తి, డివిజన్ ప్రెసిడెంట్ జయ భారత్‌రెడ్డి, నారాయణ రెడ్డి, కదిరెప్ప కడప బ్రాంచ్ సభ్యులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: అనాథ వ్యక్తి మృతదేహానికి విజన్ ఇన్‌కో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం మండలంలోని దేవరపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలియకపోవడంతో రైల్వే పోలీసులు విజన్ ఇన్‌కో ఫౌండేషన్ చైర్మన్ రేణు చందనకు తెలియజేశారు. ఫౌండేషన్ సభ్యులు దిలీప్‌కుమార్, రమణారెడ్డి, షేక్ షాహిద్, చిన్ని కృష్ణ, అఖిల్‌కుమార్‌ల సహకారంతో మోతుకుపల్లి శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు



పావగడ: సరస్వతీదేవి అలంకరణలో గర్భరక్షాంభిక



లేపాక్షి: మహాలక్ష్మిదేవిగా దర్శనమిస్తున్న దుర్గాదేవి



పెనుకొండ: ధనలక్ష్మి అలంకారంలో వాసవీమాత



మోడల్‌కాలనీలో మహాచండిగా గంగమ్మతల్లి



కృష్ణావతారంలో ముద్దిరెడ్డిపల్లి పాండురంగస్వామి



సంతానలక్ష్మిగా ముద్దిరెడ్డిపల్లి చౌడేశ్వరీదేవి



హిందూపురం: పాండురంగనిగా పేట వెంకటరమణస్వామి



హిందూపురం: శ్రీరాముడి అలంకరణలో బోయకొండ గంగమ్మ



సాక్షిబృందం: భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు కొనసాగుతున్నాయి. ఐదోరోజైన సోమవారం హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో స్వామివార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

హిందూపురం: శాకంబరిగా యల్లమ్మదేవి